



# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 14 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL


### పది రోజులైతంది.. వడ్లు కొంటలేరు



మా ఊరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 10 రోజులైతంది. వడ్లు ఎప్పుడు కొంటరని నిర్వాహకులను అడిగితే గన్నీ బ్యాగ్‌లు రాలేదంటున్నరు. మొన్న ఒక సారి వర్షం పడ్డది. ఈ రోజు కూడా వర్షం పడ్డది. ధాన్యం మంచిగ ఆరింది. రెండు, మూడు రోజుల సంది మబ్బులుంటున్నాయి. ఒక్కసారిగా భారీ వర్షం పడితే మా నోట్ల మన్ను పడ్డట్లే. ఇప్పటికైనా వడ్లు కొనాలి. గతేడాది ధాన్యం తెచ్చిన వెంటనే కొన్నరు. ఈసారి ఎందుకిట్ల చేస్తున్నరో అర్థమైత లేదు.

- పెట్టం కమలాకర్, రైతు, లక్ష్మీపూర్

● రుణమో.. రేవంతు..

# రుణమాఫీపై అయోమయం

- చెల్లిస్తారా..? చెల్లించాల్నా..?
- స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- ఎన్నికల హామీని నిలబెట్టుకోని ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఊసెత్తని సర్కారు
- పెట్టుబడి సాయాన్ని వడ్డీ కింద జమ చేసుకుంటున్న అధికారులు
- రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామంటున్న బ్యాంకర్లు
- నిర్మల్ జిల్లాలో 1.70 లక్షల మంది రైతుల అవస్థలు

**అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించింది. రైతన్నలు సంబుర పడి ఓట్లు వేశారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు రుణమాఫీ ఊసెత్తకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. అసలు రుణం మాఫీ చేస్తుందా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.**

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 13 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో దాదాపు 1.70 లక్షల మంది రైతులు బ్యాంకు రుణాలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో అధికంగా రూ.1లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 1.30 లక్షల మందికి రుణమాఫీ వర్తించనుంది. ఇప్పటికే ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు మే నుంచి జూన్, జూలై వరకు చెల్లించి కొత్త రుణాలు తీసుకుంటారు. పాత రుణం చెల్లిస్తేనే కొత్త రుణం మంజూరు చేస్తామంటూ బ్యాంకు అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ఇప్పటికే సాగు చేసిన మక్క, వరి, ఇతర పంటలు చేతికి రావడంతో వాటిని అమ్ముకుంటున్నారు. ఆ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతుండడంతో వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు బ్యాంకులకు వెళ్తున్న రైతులను రుణం ఎప్పుడు చెల్లిస్తారని బ్యాంకు అధికారులు అడుగుతున్నట్లు వాపోతున్నారు. దీంతో రైతులు సర్కారు మాకు రూ.2 లక్షలు రుణమాఫీ ప్రకటించింది కదా వస్తుందేమోనని చూస్తున్నాం సార్ అని చెబుతున్నారు. అయితే బ్యాంకులో తీసుకున్న రుణం ఏడాదిలోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. చెల్లించని పక్షంలో తీసుకున్న రుణంపై వడ్డీ శాతం పెరగడం, బ్యాంకులో రైతు డిఫాల్టర్‌గా చూపించి రుణం విషయంలో కొర్రీలు పెడుతారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు రుణాలు చెల్లిస్తే ఒక బాధ, చెల్లించక పోతే మరో బాధతో అంటూ వాపోతున్నారు. రుణమాఫీపై సర్కారు స్పష్టత ఇవ్వకపోవడం రైతులకు ఇబ్బంది కలిగిస్తున్నది.

### పెట్టుబడి సాయం వడ్డీ కింద జమ

రుణమాఫీపై సర్కారు స్పష్టత ఇవ్వకపోవడంతో రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. తమ పరువు పోతుందని భావించి రైతులు రెగ్యూలర్ చేసుకునేందుకు ముందుకొస్తున్నారు. యాసంగికి పెట్టుబడి సాయాన్ని సర్కారు వారం రోజుల క్రితమే బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఆ డబ్బులతో రుణం చెల్లించాలని లేదా వడ్డీ కట్టాలని సూచిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీనికితోడు యాసంగి పంట పైసలను డ్రా చేసుకుందామంటే.. రుణం డబ్బులు కట్టి రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. రుణాలను రికవరీ చేస్తేనే కొత్త రుణాలు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడండతో వసూళ్లపై సీరియస్‌గానే ఉన్నారు. రుణాల రెన్యూవల్ గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు నిర్ణయం తీసుకుని రైతులకు మేలు చేయాలని కోరుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పటిలోగా అమలు చేస్తారో కనీసం భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### త్వరగా మాఫీ చేయాలి..



నేను కుంటాల బ్యాంకులో పంట రుణం కింద రూ.1.50 లక్షలు తీసుకున్న. యేటా జూన్‌లో రుణం డబ్బులు చెల్లించి కొత్త రుణం తీసుకుంటా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో చెల్లించాలా? వద్దా? అర్థం కావడం లేదు. బ్యాంకోళ్లు రుణం డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలి.

- నాలం శివ్వయ్య, రైతు, ఓల.

### రైతులకు నష్టమే..



కాంగ్రెస్ సర్కారు రుణమాఫీపై వెంటనే స్పష్టత ఇవ్వాలి. బ్యాంకులో తీసుకున్న రుణం ఏడాదిలోపు చెల్లిస్తేనే వడ్డీ రాయితీ ఉంటుంది. అసలుతోపాటు వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది. రుణం చెల్లిస్తేనే కొత్త రుణం ఇస్తారు. లేకుంటే డిఫాల్టర్‌గా పేర్కొంటూ కొత్త సమస్యలు చెబుతారు. ఏడాదిలోపు చెల్లించకపోతే వడ్డీ శాతం కూడా పెంచుతారు. ఏ విధంగా చూసినా రైతులకు నష్టమే.

- మంగళి గణేశ్, రైతు.

### వడ్లు కొంటరా.. కొనరా చెప్తలేరు



నాకు నాలుగున్నర ఎకరాలుంటే రెండు ఎకరాల్లో పంట కోసిన. రెండున్నర ట్రాక్టర్ల వడ్లు వచ్చినయి. గతేడాది ఎక్కడ కొన్నరో ఆ కొనుగోలు కేంద్రానికే వడ్లు తెచ్చి పోసిన. సీరియల్‌లో అందరికంటే ముందుండాలని మూడు రోజులు కిందే వచ్చిన. వడ్లు మస్తుగ ఆరినయ్. ఇగ కాంట పెట్టుడే. గతేడాది మా ఊరిలో డీసీఎంఎస్ కేంద్రం ఉండే కానీ ఇప్పుడు మహిళా సంఘాలకు ఇచ్చిన్రు. ఇక్కడికి ఎవ్వరూ వస్త లేరు. అసలు కొంటారా.. కొనరా.. తెల్వదు. పోయినేడాది ఈ పాటికే కొనుగోలు చేసిన్రు. గిప్పుడేమో ఎవ్వరు సప్పుడు చేస్తలేరు. గిట్ల ఇబ్బంది పెట్టుడు న్యాయం కాదు.

- పెంద్యాల కొమురమ్మ, రైతు, కొత్తూరు



మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం కొత్తూర్ గ్రామ శివారులో వర్షానికి వడ్లు తడవకుండా కవర్లు కప్పిన రైతులు

● చినుకు వణుకు

# కేంద్రాల్లో ధాన్యం.. కండ్లలో దైన్యం..

**ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతాంగం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. ఎన్నో ఆశలతో వరి కోసి కేంద్రాలకు తరలించగా, కొనుగోళ్లు చేపట్టకపోవడంతో నిరీక్షించాల్సి వస్తున్నది. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోగా, సేకరణపై యంత్రాంగం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నది. ఇప్పటికే వానలు పడుతుండగా, తడిచిన వడ్లను చూసి కన్నీరు పెడుతున్నది.**

## పేరుకే కొనుగోలు సెంటర్ల కేటాయింపు.. క్షేత్రస్థాయిలో ఒక్క గింజా కొనని సర్కారు

● సేకరణపై స్పష్టత కరువు ● పేరుకుపోతున్న నిల్వలు ● వానతో తడుస్తున్న వడ్లు ● ఆందోళనలో అన్నదాతలు

మంచిర్యాల, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లాలో 2023-24 యాసంగి సీజన్‌లో 275 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సివిల్ సప్లయ్ అధికారులు పేపర్లపై లెక్కలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం కొనడం లేదు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా పేరుకుపోతున్నా, ఇప్పటి వరకు సేకరణ ప్రారంభించలేదు. ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లను ప్రారంభించినట్లు ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప.. ఒక్క వడ్ల గింజనూ కొన్నది లేదు. సీరియల్‌లో ఫస్ట్ ఉంటే.. ఫస్టే కొంటారని రైతులు పది.. పన్నెండు రోజుల క్రితమే ధాన్యం తెచ్చి కేంద్రాల్లో పోయగా, అసలు కొనుగోళ్ల ఊసే ఎత్తడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిచిపోతుంటే చూసి కన్నీరు పెడుతున్నారు. గడిచిన పదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, వచ్చిన ధాన్యం వచ్చినట్లు కొన్నారని, ఈ ఏడాది అసలు కొనుగోలు కేంద్రాలు ఉన్నాయా.. లేదా.. అనేది కూడా చెబుతలేరని వాపోతున్నారు.

### మంచిర్యాల నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి..

మంచిర్యాల జిల్లాలో డీఆర్‌డీఏ ఏజెన్సీ ద్వారా 132, పీఏసీఎస్ 106, మెప్మా 6, డీసీఎంఎస్ 31 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 130 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బెల్లంపల్లిలో 25, చెన్నూర్‌లో 51, మంచిర్యాలలో 38, ఖానాపూర్‌లో 16 కేంద్రాలు ఉండేవి. జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 90 కేంద్రాలు, మంచిర్యాల నియోజకవర్గంలో 47 కేంద్రాలు ఉండాలి. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులను మార్చారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం పీఏసీఎస్ 38, డీసీఎంఎస్ 47 కేంద్రాలకు పర్మిషన్ ఇవ్వలేదు. వీటి స్థానంలో డీఆర్‌డీఏ ఏజెన్సీ ద్వారా మహిళా సంఘాలతో కొనుగోళ్లు చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చెప్పారు. దీంతో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గతంలో కొనుగోలు కేంద్రాలున్న ప్రాంతాల్లో ఇప్పటి వరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అసలు ఈ కేంద్రాలుంటాయా.. లేదా.. అనే విషయంలో స్పష్టత లేదు. ఇప్పటి వరకు మంచిర్యాల నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఎన్ని కేంద్రాలున్నాయనేది కూడా అధికారులు చెప్పడం లేదు. పోనీ, 275 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇచ్చిన జాబితానైనా ఫైనలనుకుంటే.. అది కూడా ఎటూ తేల్చడం లేదు.

### మిల్లుల ట్యాగింగ్ షీట్లు రాలేదు

డీసీఎంఎస్, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో స్పష్టత లేకపోవడంతో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తున్నాయి. పోనీ డీఆర్‌డీఏ ద్వారా ఐకేపీలకు అప్పగించిన కేంద్రాల్లోనైనా ధాన్యం కొంటున్నారా అంటే అదీ లేదు. కొనుగోలు కేంద్రాలు ఫైనల్ కాకపోవడంతో మిల్లులకు ట్యాగింగ్ చేయలేదు. ఏ కొనుగోలు కేంద్రం నుంచి ఏ మిల్లుకు బియ్యం వెళ్లాలి అనే విషయంలో స్పష్టత లేదు. దీంతో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాలకు మిల్లుల ట్యాగింగ్ షీట్లు రాలేదు. రెండు రోజుల క్రితం గన్నీ సంచులే లేవని, ఇప్పుడిప్పుడే వస్తున్నాయంటూ రైతులు చెబుతున్నారు. మిల్లుల ట్యాగింగ్ రాకపోతే ధాన్యం కొనే పరిస్థితి లేదు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టడం ఆలస్యమయ్యే కొద్దీ ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుంది. చివరకు కొనుగోలు చేసినా లారీల లోడింగ్, అన్‌లోడింగ్ సమస్య వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఎప్పటి ధాన్యం అప్పుడు కొంటేనే లారీలు దొరక్క రెండు, మూడు రోజులపాటు కల్లాల్లోనే ఎదురు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు అంతా కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నా దృష్ట్యా.. రోజుల తరబడి లారీల కోసం ఎదురు చూడాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# పెరగని రుణం

● పంటల వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

● రైతులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు ● పెరిగిన సాగు ఖర్చులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రైతులకు చేయూతనందించాల్సిన బ్యాంకర్లు పెట్టుబడులకు అవసరమైన అప్పులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2024-25 సంవత్సరానికి సాగుతోపాటు ఇతర అనుబంధ రంగాలకు మంజూరు చేసే రుణ ప్రణాళిక ఖరారైంది. ఇందుకు సంబంధించిన రుణ పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) వివరాలను బ్యాంకులకు అందజేసింది. యేటా ఖర్చులు పెరుగుతుండగా.. ఇందుకు అనుగుణంగా రుణాల పెరుగుదల లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది రైతులు సాగు చేసే ప్రధాన పంటల్లో కొన్నింటికి మాత్రమే రుణాల్లో స్వల్ప పెరుగుదల ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో యేటా వానకాలంలో 5.60లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. వీటిలో నాలుగు లక్షల ఎకరాల వరకు పత్తి సాగవుతున్నది. మిగతా విస్తీర్ణంలో కంది, సోయా, వరి, పెసర, మినుములు, ఇతర పంటలు వేస్తారు. యాసంగిలో 1.50 లక్షల ఎకరాల్లో శనగ, జొన్న, మొక్కజొన్న సాగు చేస్తారు.

### పెరిగిన పంట పెట్టుబడులు

సాగులో రైతులు ఇబ్బందులు పడకుండా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకంలో భాగంగా ఎకరాకు రూ.10 వేలను అందజేసింది. వీటితోపాటు పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సాగు చేస్తున్నారు. యేటా పెట్టుబడి ఖర్చులు బాగా పెరుగుతున్నాయి. దుక్కి దున్నింది మొదలుకుని పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు రైతులు భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పత్తి విత్తనాల ధరలను పెంచగా.. ఎరువులు, పురుగుల మందుల ధరలను కూడా బాగా పెంచింది. డీజిల్ ధరల పెరుగుదల కారణంగా పొలం దున్నడానికి వినియోగించే ట్రాక్టర్ల ధరలను బాగా పెంచారు. కలుపు తీయడానికి, పత్తి, ఇతర పంటలను తీయడానికి కూలీ రేట్లు బాగా అయ్యాయి. ఇలా పలు కారణాల వల్ల రైతులకు పెట్టుబడులు తడిసిమోపెడవుతున్నాయి. ఖర్చులు పెరగడంతో బ్యాంకులు ఇచ్చే రుణం సరిపోక రైతులు ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తున్నది. అధిక వడ్డీల కారణంగా రైతులపై ఆర్థిక భారం పడుతున్నది.



### పెరగని రుణ పరిమితి

టెస్కాబ్ ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన వార్షిక రుణ పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)లో వివిధ పంటలకు బ్యాంకులు అందించే రుణాలు ఖర్చులకు తగిన విధంగా పెరుగలేదు. పత్తి సాగులో భాగంగా రైతులు జూన్‌లో విత్తనాలు వేస్తారు. అక్టోబరు చివరి వారంలో పంటను తీయడం మొదలు పెట్టగా, ఎక్కువ మంది రైతులు జనవరి చివరివారం వరకు విక్రయానికి తీసుకొస్తారు. ఇందుకు ఎకరా సాగు చేయాలంటే రూ.55 వేల వరకు ఖర్చు చేయాలి. గతేడాది పత్తి పంటకు బ్యాంకుల ద్వారా ఎకరాకు రూ.45 వేల రుణం ఇవ్వగా.. ఈ ఏడాది రూ.1000 మాత్రమే పెంచి రూ.46 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. సోయాబిన్‌కు గతేడాది ఎకరాకు రూ.28 వేలు ఉండగా రూ.2 వేలు పెంచి రూ.30 వేలుగా నిర్ణయించారు. జిల్లాలో రైతులు ఎక్కువగా పండించే కంది, శనగ, జొన్నతోపాటు వరి, పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు రుణ పరిమితి పెంచలేదు. జిల్లాలో రైతులు కూరగాయ పంటలను ఎక్కువగా పండిస్తారు. వీటిల్లో రుణాలను అంతంతమాత్రంగానే పెంచారు. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలకు రూ.35 వేల లోపు, వంకాయసాగు మల్చింగ్‌తో చేస్తే రూ. 55 వేలు లేకపోతే రూ.40 వేలుగా నిర్ణయించారు. సాగుతోపాటు అనుబంధ రంగాలకు రుణ పరిమితి తక్కువగా ఖరారు చేశారు. బర్రె కొనుగోలుకు రూ.33 వేలు, గొర్రెలు, మేకలకు రూ.24 వేలుగా నిర్ణయించారు. వార్షిక రుణ ప్రణాళిక నామ్‌కే వాస్తేగా ఉందని రైతులు అంటున్నారు.

# ఈదురు గాలులతో వర్షం

### నేలరాలిన మామిడి కాయలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 13 : రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉంటున్నది. రెండు రోజులుగా రాత్రిపూట చల్లని గాలులతో కూడిన సాధారణ వర్షం కురుస్తున్నది. అక్కడక్కడ చేతికందిన మొక్కజొన్న తడిసిపోయింది. కాత దశలో ఉన్న నువ్వు పంట పూతరాలింది. చేతికందే దశలో ఉన్న మామిడి కాయలు ఈదురు గాలులకు రాలాయి.



న్యూ లోలంలో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు



నిందితులను చూపిస్తున్న పోలీసు బృందం

# గంజాయి పట్టివేత

ఉట్నూర్, ఏప్రిల్ 13 : గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం ఇంద్రవెల్లి మండల శివారులో కొత్తవారు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఉట్నూర్, ఇంద్రవెల్లి ఎస్ఐలు మనోహర్, సునీల్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇందులో జగిత్యాల జిల్లాకు చెందిన దూపేట రాకేశ్, ముద్దం రాంచరణ్‌ల వద్ద కిలో 60 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. వీరు కొంత కాలంగా గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిని విచారించగా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ చెందిన మెస్రం షేకు, గిన్నెర గ్రామానికి చెందిన జుగ్నాక భీంరావు, ఆదిలాబాద్ మండలం బొప్పాపూర్‌కు చెందిన మెస్రం రవీందర్, కుమ్ర రాంజీల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేయగా గిన్నెల గ్రామానికి చెందిన జుగ్నాక భీంరావు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం..

**మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కేటాయించకపోవడంపై ఆగ్రహం**

- మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి..
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ



అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎదులాపురం, ఏప్రిల్ 13 : మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కేటాయించని కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గల విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్‌పై అవివేకంతో మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలతోపాటు ఒక అసెంబ్లీ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా మాదిగలకు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చావు డప్పు కొట్టడం ఖాయమన్నారు. రేవంత్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో ఊరూరా మాదిగ వాడలు, పల్లెల్లో ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఇండ్ల ఎల్లన్న, పసుల వేణు, జిల్లా కార్యదర్శి ఆరెపల్లి సురేశ్, స్వామి మాదిగ, కొమ్ము కిరణ్, డోంగ్రె సంజీవ్, చిరు పాల్గొన్నారు.

# ఆత్రం సక్కును గెలిపించండి..

కుంటాల, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సభ్యురాలు రమాదేవి అన్నారు. శనివారం మండలంలో పర్యటించిన ఆమె వివిధ గ్రామాల కార్యకర్తలతో సమావేశం అయ్యారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార సరళిపై చర్చించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు, సాగునీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతుంటే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దత్తు, సోషల్ మీడియా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్, పార్టీ మైనార్టీ కన్వీనర్ ఖదీర్ పాల్గొన్నారు.

# నగదు పట్టివేత

జైనథ్, ఏప్రిల్ 13 : మండలంలోని ఫౌజ్‌పూర్ దగ్గర మహారాష్ట్ర బస్సు(ఎంహెచ్ 40ఎన్ 9379)ను అధికారులు తనిఖీ చేశారు. చంద్రపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సులో ఉన్న కర్మకర్ చందు అనే ప్రయాణికుని బ్యాగులో రూ.2.50 లక్షల నగదు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో కేసు నమోదు చేశారు. ఈ నగదును ఆదిలాబాద్ జిల్లా ట్రెజరి ఖాతాలో జమ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు.